క్లుప్తంగా

కన్నులపండువగా తెప్పోత్సవం



చేబ్రోలులో సీతారామస్వామి తెప్పోత్సవం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వేంచేసిన సీతారామస్వామివారి తెప్పోత్సవం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. వేలాది మంది భక్తులు తెప్పోత్సవాన్ని కనులారా తిలకించారు. తొలుత ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా కోటలంక చెరువు వద్దకు తీసుకెళ్లారు. చెరువులో హంస వాహనంపై స్వామివారు విహరించారు. గ్రామం గోవింద నామస్మరణతో మార్మోగింది. బాణసంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



కాలువలో పడిపోయిన ట్రాక్టర్

సామర్లకోట: అతి వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి గోదావరి కాలువలో బోల్తా పడింది. శనివారం సాయంత్రం సామర్లకోట నుంచి వేట్లపాలెం వెళ్తున్న ట్రాక్టర్ కెనాల్ రోడ్డులో హుస్సేన్‌పురం సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి గోదావరి కాలువలోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ ముందే దూకేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మరో ట్రాక్టర్ సహాయంతో గోదావరి కాలువలోకి దూసుకుపోయిన ట్రాక్టర్‌ను బయటకు లాగారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దీపారాధన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటైంది. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయంలో దీపాలను వెలిగించారు. సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేయండి



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

సామర్లకోట: ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల జాబితాలను బీఎల్‌ఓలు వేగంగా పరిశీలించాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జాబితాలో తప్పులు లేకుండా ఇంటింటా పరిశీలన చేయాలని సూచించారు. ఓటర్ల పేర్లు, ఫోటో, చిరునామా వంటివి తప్పులు జరిగే అవకాశం ఉంటుందని, వాటిపై దృష్టి సారించాలన్నారు. పోలింగ్ రోజున తమ ఓటు లేదనే ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టీపీఓ ఫణికుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

కాకినాడ సిటీ: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి శనివారం అమరావతి నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అనంతరం ఆమె అధికారుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అధికారులు ముందుకు సాగాలని కలెక్టర్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. జిల్లా జెడ్పీ చైర్మన్ ఎ.రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు ఎస్.విజయకుమార్, సూర్యప్రకాశరావు, బి.లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేజనా సుఖినోభవంతు

- కుష్ఠు వ్యాధి రహిత సమాజానికి కృషి
- క్షేత్రస్థాయిలో బాధితుల గుర్తింపు
- చికిత్స విధానాలపై అవగాహన



పాఠశాలలో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దాపురం: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ఆరోగ్య భరోసాకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.. ముందస్తు అవగాహనతోనే ఏ వ్యాధినైనా ఆదిలోనే గుర్తించవచ్చని చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది.. అలాంటి ప్రయత్నంలో భాగంగా కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయి. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించే లక్ష్యంతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాయి. దానికి అనుగుణంగా సర్వే చేసి చికిత్సా విధానంపై రోగులకు అవగాహన కల్పిస్తున్నాయి.

పెద్దాపురం అర్బన్‌లో మహారాణి కళాశాల ఎదురుగా కుష్ఠు రోగుల కోసం ఓ కాలనీ ఉంది. ఇక్కడ దాదాపు 35 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారందరికీ ఏరియా ఆసుపత్రి నుంచి వైద్య సేవలందిస్తున్నారు. అలాగే పులిమేరు పీహెచ్‌సీ పరిధిలో 23, కాండ్రకోట పీహెచ్‌సీ పరిధిలో 21 మంది కుష్ఠు రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఇంకా లెప్రసీ కేసుల గుర్తింపునకు వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. చిన్నారులను పరీక్షించి మచ్చలుంటే వారి ఆరోగ్య పరిస్థితిపై నిపుణులకు నివేదిస్తున్నారు. ముందుగా ఆశా, వైద్య ఆరోగ్య కార్యకర్తలు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరిస్తున్నారు. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి, డివిజన్ స్థాయిలో డీపీఎంఓ స్థాయి అధికారి షెడ్యూల్ ప్రకారం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

లక్షణాలు బట్టి చికిత్స

ఈ వ్యాధి సోకడానికి ప్రధాన కారణం మైక్రో బ్యాక్టీరియా. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చపై వెంట్రుకలు రాలిపోతాయి. దురద, స్పర్శ, నొప్పి ఉండదు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆశ, ఏఎన్‌ఎంలకు చెప్పాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్సలు ఉన్నాయి. వ్యాధిగ్రస్తులు మానసికంగా, దృఢంగా ఉండేందుకు కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రతి పీహెచ్‌సీలో ప్రతి నెలా 10వ తేదీ, 11న పెద్దాపురం లెప్రసీ కాలనీలో చికిత్స చేస్తారు. పుండ్లు ఉన్నవారికి అవసరాన్ని బట్టి కత్తిపూడిలోని రిఫరల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తారు. చేయించుకున్న వారికి రూ.8 వేల పారితోషికాన్ని ఇస్తారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.మూడు వేల పింఛన్, నెలకు 35 కిలోల బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ఈ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించడం ద్వారా నివారణ సాధ్యమని వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి



కుష్ఠు వ్యాధి పట్ల ఉన్న అపోహలు వీడాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి. పాఠశాలలు, క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం. కుష్ఠు వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదు. ప్రభుత్వం క్రమం తప్పకుండా సర్వే, చికిత్సా సాయాన్ని అందిస్తుంది.

–బి.శాంతారత్నం, సీహెచ్‌ఓ, కాండ్రకోట పీహెచ్‌సీ

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



పిఠాపురంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలుగా ఉండే ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద వెలసిన పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.65 లక్షలతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎందరో భక్తులకు ఆరాధ్య దైవమైన పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని పలువురు భక్తులు కోరడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రముఖ శైవ క్షేత్రమైన పాదగయ చెంతన మరో ఆలయం కొత్తగా రూపుదిద్దుకోవడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో పాదగయ, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, కుంతీమాధవస్వామి ఆలయాల ట్రస్టు బోర్డు చైర్మన్లు ఆగంటి ప్రభాకరరావు, రెడ్డెం జనార్దనరావు, వరదా శేషు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పల్లెల స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో డస్ట్‌బిన్ల పంపిణీ



పంచాయతీ సర్పంచులకు డస్టు బిన్లు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రతి ఇంటికి డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పంచాయతీలకు డస్ట్ బిన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంలో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి రెండు డస్టు బిన్లు అందజేస్తున్నారన్నారు. ఈ మేరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు రూ.27.95 లక్షల విలువైన 36 లక్షల డస్ట్ బిన్లు అందజేశామని చెప్పారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తడి, పొడి చెత్తను డస్ట్ బిన్లలో వేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. డస్ట్ బిన్ల వినియోగంతో రోడ్లపై చెత్త సమస్య తగ్గుతుందన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.

'టిడ్కో' అర్హులను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: టిడ్కో గృహాల లబ్ధిదారుల్లో చనిపోయిన, వయస్సు మళ్లిన వారుంటే వారి వారసులను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక మెప్మా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన, వయసు ఎక్కువగా ఉన్న లబ్ధిదారుల బంధువుల వివరాలను తీసుకుని వారి వారసత్వ సర్టిఫికెట్లు తయారు చేయాలని సూచించారు. అదేవిధంగా ఇప్పటి వరకూ రుణాలు అందని లబ్ధిదారులకు బ్యాంకు అధికారులతో చర్చించి రుణాలు అందే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ మేరకు సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత, టీపీఓ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

పెద్దాపురం: వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వరి సాగుపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిరత్నం మాట్లాడుతూ రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. వర్షాల కారణంగా తలెత్తే ఇబ్బందులను రైతులకు వివరించి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ స్థితిగతులను వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారులు మల్లికార్జునరావు, శ్రీహరి, జ్యోతిర్మయి, శాస్త్రవేత్తలు నందకిశోర్, శర్మ, భరత్‌చంద్ర, సుధీర్, రమణారావు, సుజాత, అనూష తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా ఊడ్పులు పూర్తి చేయండి

ప్రస్తుత దాళ్వాలో రైతులు డిసెంబర్ నెలాఖరులోగా వరి ఊడ్పులను పూర్తి చేయాలని పెద్దాపురం వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్ అన్నారు. వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సిరివాడ, కాండ్రకోట గ్రామాల్లో శనివారం దాళ్వా సీజన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బర్రే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఓ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గోదావరి కాలువల నుంచి మార్చి 31వ తేదీకి నీటి విడుదలను నిలిపివేస్తారన్నారు. వెదజల్లు సాగు చేసే రైతులు డిసెంబర్ నెలాఖరులోగా ఊడ్పులు పూర్తి చెయ్యాలన్నారు. లేనిపక్షంలో ఎంటీయూ 1121, ఎంటీయూ 1153 రకాలను వేసుకోవాలన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలిచ్చారు. వ్యవసాయ సలహా మండలి సభ్యుడు యినకొండ వీరవిష్ణుచక్రం, కాండ్రకోట సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి బషీర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

దుంప సాగులో జాగ్రత్తలు పాటించాలి



దుంప తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు చలపతిరావు, జానకి

పెద్దాపురం: కర్ర పెండలం దుంప సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్‌బీవీ చలపతిరావు, పెద్దాపురం ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జానకి అన్నారు. మండలంలోని కట్టమూరు, వాలుతిమ్మాపురం, పెద్దాపురం పట్టణంలో సాగవుతున్న దుంప పంటలను శనివారం ఉద్యాన శాఖాధికారి సుజాతతో కలసి పరిశీలించి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు చలపతిరావు, జానకి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటితడులు ఇచ్చే సదుపాయం లేని దుంప తోటలకు 10 గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. పొడి వాతావరణంతో ఎర్రనల్లి వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నమూనాలను నిర్ధారణ నిమిత్తం బెంగళూరు కేంద్రానికి పంపించనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. వీహెచ్‌ఏలు విజయదుర్గ, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

మొలకువలు పాటిస్తే అధిక దిగుబడి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మల్లికార్జునరావు

పిఠాపురం: ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు విధిగా మెళకువలు పాటించాలని, తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎన్.మల్లికార్జునరావు అన్నారు. పిఠాపురం మండలం వెల్దుర్తిలో శనివారం ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న బిందు సేద్యం పరికరాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కలు పెంపకం, తెగుళ్ల నివారణ, గెలల కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కేఎస్ శైలజ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ డీజీఎం డి.రవీంద్ర, ప్రతినిధి కె.వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



తాటిపర్తిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కచ్చితంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. విలేజ్ విజిటింగ్‌లో భాగంగా శనివారం ఆయన గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పర్యటించారు. గ్రామ సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పడాల అప్పారావు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రక్షణ కల్పించడానికే పోలీసులు ఉన్నారని, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఉంటే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. గ్రామంలో యువతతో మాట్లాడిన ఆయన యువత తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పాటుపడాలన్నారు. పంటల సాగులో రైతులు చేపడుతున్న నూతన వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో వివిధ అంశాల గురించి రైతులతో ముచ్చటించారు. ప్రజలకు అన్ని వేళలా తాను అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏసమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని ఆయన తెలిపారు. ఎస్పీ వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్‌ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ప్రతి గ్రామంలో బూత్ కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

సామర్లకోట: వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్ల వివరాలు పూర్తిగా తెలిసిన వారినే కమిటీల్లో నియమించాలన్నారు. దీనివల్ల పోలింగ్ రోజున దొంగ ఓట్లు అరికట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలపై మరింత ప్రచారం చేయాలని తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మండల పరిషత్తు కో ఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



వలసపాకలలో నానో యూరియా పిచికారీకి డ్రోన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

కాకినాడ రూరల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వలసపాకల, రమణయ్యపేట గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వలసపాకల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి, డీఎల్‌డీఓ నారాయణమూర్తి పాల్గొని కేంద్ర పథకాల గురించి వివరించారు. పలువురు లబ్ధిదారులకు కేంద్ర పథకాలు అందించారు. మధ్యాహ్నం రమణయ్యపేట పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో డీపీఓ భారతీ సౌజన్య, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ కె.స్వప్న పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు మెటీరియల్

బాలాజీచెరువు: స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో శనివారం గ్రూప్–2 పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు షైన్ ఇండియా సంస్థ మెటీరియల్ పంపిణీ చేసింది. విద్యార్థులకు పరీక్ష నిర్వహించి టాప్ టెన్‌లో నిలిచిన వారికి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రసాద్ చేతుల మీదుగా వీటిని అందజేసింది. డిప్యూటీ ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి కిశోర్, రవికుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న నెక్కంటి సీఫుడ్స్ ఉద్యోగులు

సామర్లకోట: క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని స్థానిక మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వీరయ్యచౌదరి అన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలోని పరిశ్రమల ఉద్యోగులకు మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడా స్ఫూర్తితో ఉద్యోగులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పరిశ్రమల మధ్య ఆటల పోటీలు నిర్వహించాలనే ఆలోచన రావడం అభినందనీయమని మహారాణి కళాశాల కరస్పాండెంట్ జె.రమేష్ అన్నారు. రాక్ సిరామిక్స్ ప్రతినిధులు టి.నీరజ్ కుమార్, పి.బాలాజీ, వీజీఎస్ కుమార్, ఆదర్శ్, అపర్ణ నుంచి మధుసూదన్, సత్యనారాయణ, రిలయన్స్ పవర్ నుంచి ప్రకాష్, దేవి సీఫుడ్స్ నుంచి రవీంద్రనాథ్, అనీల్, శ్రీగిరిజ పవర్ నుంచి రవి, నెక్కంటి సీఫుడ్స్ నుంచి గోపీచంద్, సురేంద్రలు ఆటల పోటీలు విజయవంతం కావడానికి సహకరించారు. స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేసిన రాక్ సిరామిక్స్ ప్రతినిధి నీరజ్‌కుమార్‌ను ఇతర పరిశ్రమల ప్రతినిధులు అభినందించారు. ప్రతి ఏడాది ఈ పోటీలు కొనసాగించాలని నిర్ణయించారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. షటిల్ సింగిల్స్ విజేతగా నెక్కంటి సీఫుడ్స్, రన్నర్స్‌గా దేవి సీఫుడ్స్, షటిల్ డబుల్స్‌లో విన్నర్స్‌గా శ్రీగిరిజ పవర్ ప్లాంట్, రన్నర్స్‌గా రాక్ సిరామిక్స్, వాలీబాల్ విన్నర్స్‌గా నెక్కంటి సీఫుడ్స్, రన్నర్స్‌గా రాక్ సిరామిక్స్, క్రికెట్ విన్నర్స్‌గా నెక్కంటి సీఫుడ్స్, రన్నర్స్‌గా శ్రీగిరిజ పవర్ ప్లాంట్ బహుమతులు దక్కించుకున్నాయి.

షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో వచ్చే నెల 18 నుంచి ప్రారంభం కానున్న షష్ఠి ఉత్సవాలకు శనివారం పందిరి రాట వేశారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ఉపసర్పంచ్ దాసం వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి రాట ముహూర్తం చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

పౌర్ణమి వేడుక.. చూతము రారండి



శోభాయమానంగా సామర్లకోట పంచారామ క్షేత్రం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కార్తిక పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారు జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం జరుగుతుంది. గాంధీచౌక్ మీదుగా పట్టణ పురవీధుల నుంచి ఈ ఉత్సవం సాగనుంది. సాయంత్రం ఆలయ ముఖ ద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవులో గోదావరి హారతి ఉంటుందని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. తర్వాత స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం నిర్వహిస్తారు. జ్వాలాతోరణాన్ని పురస్కరించుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కృత్తికా నక్షత్రం, కార్తిక పౌర్ణమి ఆదివారం మధ్యాహ్నం నుంచి రావడంతో సోమవారం తెల్లవారు జామున స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామని ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్వామివారి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కోనేరులో బుధవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహిస్తారు.



తొలి తిరుపతిలో స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూ



శృంగారవల్లభ స్వామివారు

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తిక త్రయోదశిని పురస్కరించుకుని సుమారు 15 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామివారికి రూ.3,67,114 ఆదాయం సమకూరిందని ఈఓ నారాయణమూర్తి తెలిపారు. దాతలను ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించారు.